ఉర్విల్ ఉరుములు..

36 బంతుల్లో సూపర్ సెంచరీ

'స్మాట్'లో వరుసగా రెండో సుడిగాలి శతకం

ఇండోర్: ఇటీవలే ముగిసిన ఐపీఎల్ మెగా వేలంలో తనను దక్కించుకోనందుకు ఫ్రాంచైజీలు పశ్చాత్తాపపడేలా చేస్తున్నాడు గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్. దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో వారం రోజుల క్రితమే 28 బంతుల్లో శతకం బాది భారత్ తరపున పొట్టి ఫార్మాట్‌లో వేగవంతమైన సెంచరీని నమోదు చేసిన ఈ గుజరాత్ బ్యాటర్.. తాజాగా మరోసారి అదే ఫీట్‌ను రిపీట్ చేశాడు. గ్రూప్-బీలో భాగంగా ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉర్విల్ (41 బంతుల్లో 115 నాటౌట్; 8 ఫోర్లు, 11 సిక్సర్లు) 36 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేశాడు. అతడి ధాటికి ఉత్తరాఖండ్ నిర్దేశించిన 185 పరుగుల లక్ష్యం చిన్నబోయింది. 13.1 ఓవర్లలోనే గుజరాత్ ఛేదనను పూర్తిచేసింది. స్మాట్‌లో ఆడిన 6 మ్యాచ్‌లలో ఐదో విజయం కావడం గమనార్హం. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో ఉర్విల్ (5 మ్యాచ్‌లలో 282) ఐదో స్థానంలో ఉన్నాడు.

అడిలైడ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టుకు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నాయి. ఈనెల 6 నుంచి అడిలైడ్ వేదికగా ఇరు జట్ల మధ్య డే అండ్ నైట్ టెస్టు జరుగుంది. ఇప్పటికే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం పీఎం లెవన్‌తో కాన్‌బెర్రాలో మ్యాచ్ ఆడిన టీమ్‌ఇండియా..అడిలైడ్‌లో అడుగుపెట్టగానే ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టింది. మ్యాచ్‌కు మరో రెండే రోజులు మిగిలుండటంతో రెండు జట్లు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. చాలా రోజుల తర్వాత గులాబీ బంతితో డే అండ్ నైట్ టెస్టు ఆడబోతున్న టీమ్‌ఇండియాకు అడిలైడ్‌లో గత అనుభవాలు వెంటాడుతున్నాయి. గత బీజీటీ టోర్నీలో ఇదే అడిలైడ్ పిచ్‌పై టీమ్‌ఇండియా టెస్టుల్లో చెత్త రికార్డు(36 ఆలౌట్)ను మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. తిరిగి అలాంటి ప్రదర్శన చేయద్దనుకుంటున్న భారత్ అందుకు తగ్గట్లు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నది. రాత్రి సమయంలో గులాబీ బంతితో వచ్చే స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు గంటల కొద్ది ప్రాక్టీస్ చేస్తున్నారు. మంగళవారం భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్లు సెషన్ల వారీగా సాధన చేశారు. టీమ్‌ఇండియా నుంచి మొత్తం నాలుగు నెట్స్‌లో ఓపెనింగ్ ద్వయం యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, రోహిత్‌శర్మ, రిషబ్‌పంత్, సుందర్, నితీశ్‌కుమార్‌రెడ్డి త్రోడౌన్స్‌తో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. వీరి ప్రాక్టీస్ చూస్తే..బ్యాటింగ్ ఆర్డర్‌ను తలపిస్తూ ఒకరి తర్వాత నెట్స్‌లో ఆడారు. పెర్త్‌లో సూపర్ సెంచరీతో కదంతొక్కిన యశస్వి జైస్వాల్‌కు తోడు అనుభవాన్ని చాటుకున్న రాహుల్‌ను అడిలైడ్ టెస్టులోనూ ఓపెనింగ్‌కు పంపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీన్ని బలపరుస్తూ కెప్టెన్ రోహిత్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు సిద్ధమైన్నట్లు తెలిసింది. జైస్వాల్, రాహుల్ ఫామ్‌ను కొనసాగించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గుచూపినట్లు వార్తలు వస్తున్నాయి.

రోహిత్ ముమ్మరంగా:

వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ రోహిత్..అడిలైడ్ టెస్టులో భారత్‌ను నడిపించనున్నాడు. పెర్త్ టెస్టులో బుమ్రా కెప్టెన్సీలో టీమ్‌ఇండియా దుమ్ములేపగా, అడిలైడ్‌లోనూ అదే దూకుడు కొనసాగించేందుకు ఉవ్విళ్లూరుతున్నది. ఇందుకోసం ప్రాక్టీస్ మేక్ పర్ఫెక్ట్ అన్న సూత్రానికి కట్టుబడుతూ ప్లేయర్లు ముందుకుసాగుతున్నారు. ముఖ్యంగా రోహిత్..మంగళవారం రెండు సెషన్ల పాటు ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. త్రోడౌన్ స్పెషలిస్టులు నువాన్ సేనావిరత్నే(లెఫ్ట్‌ఆర్మ్), రాఘవేంద్ర, దయానంద్ విసిరిన బంతులను రోహిత్ సమర్థంగా ఎదుర్కొన్నాడు. పిచ్‌పై వేగంగా దూసుకొస్తున్న బంతులను అదే ఒరవడితో హిట్‌మ్యాన్ షాట్లు ఆడాడు. తన ట్రేడ్‌మార్క్ పుల్‌షాట్లు ఆడుతూ ఆత్మవిశ్వాసం కనబరిచాడు. మరో వైపు బెంగాల్ ద్వయం ఆకాశ్‌దీప్, ముకేశ్‌కుమార్..నెట్స్‌లో తమదైన స్వింగ్‌తో విరాట్‌ను ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేశారు. మరో ఎండ్‌లో యువ పేసర్ హర్షిత్ రానా..తన గురువు గంభీర్, బౌలింగ్ కోచ్ మార్నీ మోర్కెల్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. మరో వైపు సిరీస్‌లో వెనుకంజలో ఉన్న ఆస్ట్రేలియా..పుంజుకునే ప్రయత్నంలో ప్రాక్టీస్ చెమటోడ్చారు. మొత్తంగా రెండు జట్లు సిరీయస్‌గా ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాయి.

అడిలైడ్ టెస్టుకు సర్వం సన్నద్ధం

గులాబీ ప్రాక్టీస్

నెట్స్‌లో చెమటోడ్చిన ఇరు జట్లు .. రెండు సెషన్లలో రోహిత్ బ్యాటింగ్

కివీస్‌కు షాక్

- **డబ్ల్యూటీసీ పాయింట్లలో కోత**

దుబాయ్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో ఉన్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు షాక్ తగిలింది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో క్రిస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టుకు మూడు పాయింట్ల కోత విధిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పాయింట్ల కోతనే గాక ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులోనూ 15 శాతం జరిమానా పడింది. కివీస్‌తో పాటు ఇంగ్లండ్‌కూ ఇది వర్తించనుంది. దీంతో న్యూజిలాండ్ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం 47.92 పాయింట్ల శాతంతో ఐదో స్థానంలో నిలిచింది. ఇక ఆ జట్టు ఫైనల్ రేసులో నిలవాలంటే తర్వాత ఆడబోయే రెండు టెస్టులలోనూ గెలిచి ఇతర జట్ల ఫలితాలు తమకు అనుకూలంగా వస్తేనే అవకాశముంటుంది.

ఫుట్‌బాల్ మ్యాచ్‌లో హింస

బెర్లిన్: రెండు రోజుల క్రితం గినియాలో జరిగిన ఓ సాకర్ మ్యాచ్‌లో తొక్కిసలాటకు గురై 56 మంది మరణించిన ఘటన మరువకముందే జర్మనీలో మరో ఫుట్‌బాల్ మ్యాచ్‌లో హింస చెలరేగిన వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 30న కార్ల్ జీస్ జెనా ఎఫ్‌సీ, బీఎస్‌జీ చెమీ లీప్‌జిగ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసుల అత్యుత్సాహంతో సుమారు 80 మంది గాయపడ్డారు. మ్యాచ్‌లో కార్ల్ జీస్ 5-0తో ఆధిక్యంలో ఉన్న సమయంలోనే ఆ జట్టు అభిమానులు నగరంలో భారీ ర్యాలీకి దిగారు. స్టేడియానికి సమీపంలోనే ఈ ప్రదర్శన జరగ్గా దీనికి అనుమతుల్లేవనే కారణంతో పోలీసులు అభిమానులను అడ్డుకున్నారు.

సిరీస్ పాక్ కైవసం

బులవాయి: జింబాబ్వేతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే పాకిస్థాన్ 2-0తో కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన రెండో టీ20లో జింబాబ్వే.. 2.4 ఓవర్లలో 57 పరుగులకు ఆలౌటైంది. పాక్ బౌలర్ సుఫియాన్ ముఖీమ్ (5/3) ఐదు వికెట్ల ప్రదర్శనతో జింబాబ్వే విలవిల్లాడింది. అనంతరం లక్ష్యాన్ని పాక్.. 5.3 ఓవర్లలోనే వికెట్లేమీ నష్టపోకుండా ఛేదించింది.

వరుసగా నాలుగో డ్రా

- **ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్**

సింగపూర్: దొమ్మరాజు గుకేశ్, డింగ్ లిరెన్ మధ్య సింగపూర్ వేదికగా హోరాహోరీగా జరుగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డ్రా ల పర్వం కొనసాగుతోంది. మంగళవారం జరిగిన ఏడో గేమ్ కూడా డ్రాగా ముగిసింది. ఏకంగా ఐదు గంటల పాటు మారథాన్ మ్యాచ్ ఆడిన గుకేశ్, లిరెన్ గెలుపు కోసం నువ్వా నేనా అన్న రీతిలో పోరాడారు. చివరికి 72 ఎత్తుల తర్వాత ఇరువురు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. ఈ టోర్నీలో ఇది ఐదో డ్రా కాగా వరుసగా నాలుగోవది. ఏడో గేమ్ సైతం డ్రాగా తేలడంతో ఇరువురూ 3.5 పాయింట్లతో సమంగా నిలిచారు. ఒక రోజు విరామం తర్వాత జరిగిన ఏడో మ్యాచ్‌లో గుకేశ్ తెల్లపావులతో ఆడాడు. ఆరంభం నుంచే తెలివిగా పావులు కదుపుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అతడి ఎత్తులకు బదులిచ్చేందుకు లిరెన్ ఎక్కువ సమయం తీసుకున్నాడు. ఒకదశలో గుకేశ్ మ్యాచ్‌ను సొంతం చేసుకునేటట్లు కనిపించాడు. కానీ ఆఖర్లో లిరెన్ చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకోవడంలో గుకేశ్ సఫలీకృతం కాలేకపోయాడు. బుధవారం ఈ ఇద్దరి మధ్య 8వ గేమ్ జరుగనుంది.

మెరిసిన వరంగల్ బాక్సర్లు

68వ ఎస్‌జీఎఫ్‌ఐ బాక్సింగ్ టోర్నీ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 3: హనుమకొండ జేఎన్‌ఎస్‌లో 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) బాలికల అండర్-19 బాక్సింగ్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారంతో ముగిసిన టోర్నీలో వరంగల్ బాక్సర్లు సత్తాచాటారు. 45 కేజీల విభాగంలో నిఖిత(రంగారెడ్డి, స్వర్ణం), కావ్య(వరంగల్, రజతం), 45-48 కేజీల విభాగంలో శ్రీలేఖ(మహబూబ్‌నగర్, స్వర్ణం), అనూష(హైదరాబాద్, రజతం), 57-60 కేజీల విభాగంలో నవ్య(వరంగల్, స్వర్ణం), సుభంగి సవేర్(హైదరాబాద్, రజతం), 60-64 కేజీల విభాగంలో ఖైతీజా బేగం(హైదరాబాద్, స్వర్ణం), లక్ష్మీప్రసన్న(వరంగల్, రజతం) పతకాలు సాధించారు. మొదటి రోజు బాలికల అండర్-17 పోటీలు జరుగగా, రెండో రోజు అండర్-19 బాలికలు తలపడ్డారు. ఈ టోర్నీలో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 150 మంది ప్లేయర్లు పాల్గొన్నట్లు రాష్ట్ర బాక్సింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్థసారథి పేర్కొన్నారు.

ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి టీమ్‌కు డీజీపీ అభినందన

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అఖిల భారత లాన్‌టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బృందాన్ని డీజీపీ డాక్టర్ జితేందర్ అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లో చంద్రవశేఖర్‌రెడ్డి టీమ్..డీజీపీని కలిసింది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పసిడి పతకం గెలువడం సంతోషంగా ఉందని వారిని డీజీపీ అభినందించారు. నవంబర్ 26 నుంచి 30 వరకు బెంగళూరులో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోలీస్ డిపార్ట్‌మెంట్, పారామిలటరీ బలగాల కోసం ఈ టోర్నీని నిర్వహించారు. టెన్నిస్ డబుల్స్ ఫైనల్లో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఎస్పీ రియాజ్ జోడీ..ఏపీకి చెందిన రామ్‌కుమార్, సత్యనారాయణ ద్వయంపై స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే.

భారత్‌లో అంధుల క్రికెట్ ప్రపంచకప్

- **పాక్ మ్యాచ్‌లు హైబ్రిడ్ పద్ధతిలో..!**

ఢిల్లీ: వచ్చే ఏడాది భారత్ మరో ప్రతిష్ఠాత్మక క్రికెట్ టోర్నీకి ఆతిథ్యమివ్వబోతోంది. మహిళల అంధుల టీ20 ప్రపంచకప్-2025 భారత్‌లో జరుగనుంది. ఈ మేరకు ప్రపంచ అంధుల క్రికెట్ సమాఖ్య (డబ్ల్యూబీసీసీ) మంగళవారం ముల్తాన్‌లో జరిగిన ఏజీఎంలో వెల్లడించింది. 11 దేశాలు ఆడబోయే ఈ టోర్నీలో ఆతిథ్య హక్కులు గతేడాదే భారత్‌కు దక్కాయి. కాగా ఈ టోర్నీలో పాకిస్థాన్ క్రికెటర్లకు వీసాలు రాకుంటే ఆ దేశం ఆడే మ్యాచ్‌లను హైబ్రిడ్ పద్ధతిలో (శ్రీలంక లేదా నేపాల్‌లో) నిర్వహించే అవకాశమున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ ఇండియా (సీఏబీఐ) అధ్యక్షుడు జేకే మహంతేష్ తెలిపారు. కాగా పాకిస్థాన్‌లో మంగళవారం ముగిసిన పురుషుల అంధుల టీ20 ప్రపంచకప్-2024ను పాకిస్థాన్ గెలుచుకుంది. ఈ టోర్నీ ఆడేందుకు కేంద్ర ప్రభుత్వం భారత ఆటగాళ్లకు వీసాలు నిరాకరించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో సంతోశ్ ట్రోఫీ ఫైనల్స్

- **57 ఏండ్ల తర్వాత ఆతిథ్యం**

ఢిల్లీ: ఫుట్‌బాల్‌లో ఘనమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ 57 ఏండ్ల (1967లో చివరి సారిగా) తర్వాత ప్రతిష్ఠాత్మక సంతోశ్ ట్రోఫీ ఫైనల్స్‌కు ఆతిథ్యమివ్వనుంది. 78వ సీనియర్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్ రౌండ్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఈ మేరకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) తెలిపింది. డిసెంబర్ 14 నుంచి మొదలయ్యే ఈ టోర్నీలో 31వ తేదీన ఫైనల్ జరుగనుంది. లీగ్ దశ, క్వార్టర్స్ పోటీలకు దక్కన్ ఎరీనా ఆతిథ్యమివ్వనుండగా సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతాయి. 2023-24 సీజన్‌లో గ్రూప్ విజేతలుగా నిలిచిన 9 జట్లు (వెస్ట్‌బెంగాల్, మణిపూర్, జమ్ము కశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, మేఘాలయ), ఫైనలిస్టులు (సర్వీసెస్, గోవా), ఆతిథ్య తెలంగాణ (మొత్తం 12 జట్లు) రెండు గ్రూపులుగా విడిపోయి మ్యాచ్‌లు ఆడతాయి. రెండు గ్రూపులలో తొలి 4 స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. సంతోశ్ ట్రోఫీలో ఇప్పటి వరకూ బెంగాల్ రికార్డు స్థాయిలో 32 సార్లు విజేతగా నిలవడం గమనార్హం. కానీ 2016-17 తర్వాత ఆ జట్టు మళ్లీ టైటిల్ గెలువలేదు.

యువ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్

ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న 'కుబేర' చిత్రంలో నాగార్జున ప్రత్యేక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా సంక్రాంతి తర్వాత విడుదల కానుంది. మరి ఈ సినిమా తర్వాత నాగ్ ఏ సినిమా చేస్తారు? అనేది ఆయన అభిమానుల్లో నెలకొని ఉన్న ప్రశ్న. 'నా సామిరంగ' తర్వాత ఆయన హీరోగా సినిమా రాలేదు. అందుకే.. నాగార్జున సోలో హీరోగా నటించే సినిమా కోసం అక్కినేని అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నది. వివరాల్లోకెళ్తే.. 'హుషారు' సినిమాతో యువతరాన్ని ఆకట్టున్న యువ దర్శకుడు హర్ష ఇటీవల నాగార్జునకి ఓ కథ వినిపించారట. ఆయన కథ నచ్చడంతో, సినిమా చేసేందుకు నాగ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. జనవరిలో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. హర్ష దర్శకత్వం వహించిన 'ఓం భీం బుష్' సినిమా ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే.

గోరింటాకెట్టుకున్న సందమామవే..

అగ్ర హీరో వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలు. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా 'గోదారి గట్టు మీద రామసిలకవే..' అనే పాటను మంగళవారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించగా రమణ గోగుల, మధుప్రియ ఆలపించారు.గోదారి గట్టు మీద రామ సిలకవే..గోరింటాకెట్టుకున్న సందమామవే.. ఊరంతా చూడు ముసుగే తన్ని నిద్దర పోయిందే.ఆరాటాలన్నీ తీరకపోతే ఏం బాగుంటుందే..' అంటూ కాస్త జానపద శైలిలో సాగిన ఈ పాటలో భార్యాభర్తల మధ్య బంధాన్ని, వారి మధ్య చిలిపి సరదాలను ఆవిష్కరించారు. షూటింగ్ పూర్తికావొస్తున్నదని, క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

చిత్రం

హింసలోనే శాంతిని వెతుకుతాడు

'దసరా' సినిమాతో ఒక్కసారిగా పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. నాని కథానాయకుడిగా సింగరేణి నేపథ్య కథాంశంతో రూపొందిన ఈ సినిమా వందకోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. ప్రస్తుతం నానితోనే 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తున్నారు శ్రీకాంత్ ఓదెల. ఇదిలావుండగా ఈ యువ దర్శకుడు మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. గతకొంతకాలంగా ఈ ప్రాజెక్ట్ విషయమై సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా ఈ మెగా సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై హీరో నాని సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరి తెరకెక్కించబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విడుదల చేసిన పోస్టర్‌లో 'అతను హింసలోనే శాంతిని వెతుకుతాడు' అనే క్యాప్షన్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. పవర్‌పుల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని క్యాప్షన్‌ను చూస్తే అర్థమవుతున్నది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

'పుష్ప-3'ది ర్యాంపేజ్?

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప-2' సందడి నెలకొని ఉంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకురాబోతున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమా కొనసాగింపుగా 'పుష్ప-3' గురించి ఆసక్తికరమైన వార్తలు బయటికొస్తున్నాయి. తాజాగా ఈ సినిమాకు సౌండ్ ఇంజినీర్‌గా పనిచేసిన రసూల్ పూకుట్టి తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ ఫొటో షేర్ చేశారు. తన టీమ్‌తో కలిసి తీయించుకున్న ఈ ఫొటో వెనక 'పుష్ప-3' (ది ర్యాంపేజ్) అనే పోస్టర్ డిస్‌ప్లే కనిపిస్తున్నది. దీంతో 'పుష్ప-3' ఖాయంగా రానుందని, పార్ట్-2 క్లైమాక్స్ ఎండింగ్‌లో మూడో భాగానికి చెందిన లీడ్‌ను ఇవ్వనున్నారని చెబుతున్నారు. తాజాగా జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కూడా దర్శకుడు సుకుమార్ పార్ట్-3 గురించి అభిమానులు అడిగిన ప్రశ్నకు స్పందించారు. అల్లు అర్జున్ తనకోసం మళ్లీ మరో మూడేళ్ల సమయం కేటాయిస్తే తప్పకుండా 'పుష్ప-3' చేస్తానని అన్నారు. అయితే 'పుష్ప-2' తర్వాత సుకుమార్, అల్లు అర్జున్‌లకు వేరే కమిట్‌మెంట్స్ ఉన్నాయి. అవి పూర్తయిన తర్వాతే 'పుష్ప-3' కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'పుష్ప-3' పట్టాలెక్కడానికి చాలా సమయం పడుతుందని ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తున్నది.

ఛత్రపతి శివాజీగా రిషబ్

'కాంతార'తో నటుడిగా రిషబ్‌శెట్టి పొటెన్షియాలిటీ ప్రపంచానికి తెలిసింది. అందుకే విభిన్నమైన పాత్రలు ఆయన తలుపు తడుతున్నాయి. ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్'లో హనుమంతుడిగా ఆయన నటించనున్న విషయం తెలిసిందే. ఇటీవలే హనుమంతుడిగా ఆయన ఫస్ట్‌లుక్‌ని కూడా విడుదల చేశారు. ఆ లుక్‌లో రిషబ్‌ని చూసిన జనం సాక్షాత్ ఆంజనేయుడ్నే చూసినట్టు రోమాంచితులవుతున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది. ఈ లోపే రిషబ్‌ను మరో వైవిధ్యమైన పాత్ర వరించడం విశేషం. అది సాదాసీదా పాత్ర కాదు. మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ పాత్ర. సినిమా పేరు 'ఛత్రపతి శివాజీ మహారాజ్'. సందీప్‌సింగ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఇది కేవలం సినిమా మాత్రమేకాదు. అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన శక్తిమంతమైన వ్యక్తి చరిత్ర. ఆ మహాయోధుడి కథను సినిమాగా తీసుకురావాలనేది నిజంగా గొప్ప ఆలోచన. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో నటిస్తున్నందుకు గౌరవంగా, గర్వంగా ఉంది. సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ పొందడానికీ.. శివాజీ గురించి తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండండి' అని రిషబ్‌శెట్టి పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్, పోస్టర్ బాగా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆయన 'కాంతర' ప్రీక్వెల్ చేస్తూ బిజీగా ఉన్న విషయం తెలిసిందే.

కొండగట్టుకు వరుణ్‌తేజ్

మల్యాల, డిసెంబర్ 3 : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని సినీ హీరో వరుణ్‌తేజ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి సమక్షంలో గోత్రనామాలు చెబుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి జ్ఞాపికగా చిత్రపటాలను ఈవో రామకృష్ణారావు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించగా, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ మహిమాన్వితమైన కొండగట్టు ఆంజనేయస్వామిని హనుమాన్‌దీక్షలో దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొండగట్టు ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలుసుకున్నట్లు చెప్పారు.

హావభావాలు బాగున్నాయి

రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్‌శెట్టి కథానాయకుడు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నారు. రీసెంట్‌గా టీజర్ చూసిన అగ్ర దర్శకుడు సుకుమార్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రష్మిక క్లోజప్ షాట్స్, ఆమె హావభావాలు బాగున్నాయని, దర్శకుడు సరైన యాక్టర్స్‌ని సెలక్ట్ చేసుకున్నాడని సుకుమార్ అభినందించారు. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్ వసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్స్. ఇదిలావుంటే.. రష్మిక నటించిన తాజా చిత్రం 'పుష్ప-2' ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఆమె హిందీలో ఛావా, సికందర్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

అంచనాలు అందుకుంది

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్' అదే పేరుతో ఇటీవల తెలుగులో విడుదలైంది. ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణగౌడ్ రిలీజ్ చేశారు. సినిమాను 45 థియేటర్లలో విడుదల చేశామని, అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నదని, మహిళా ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని, ఈ సినిమా విషయంలో అంచనాలు నిజమయ్యాయని ప్రతాని రామకృష్ణగౌడ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, సీడెడ్‌లలో ఈ నెల రెండో వారంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C,